క్లుప్తంగా

కిలివేటిని ఆశీర్వదించండి



ఓట్లు అభ్యర్థిస్తున్న నేతలు

నాయుడుపేటటౌన్: సూళ్లూరుపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య, తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దెల గురుమూర్తిలను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచారాన్ని మంగళవారం ప్రారంభించారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో నేతలు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ కన్వీనర్లు బాలు, నరేష్‌లతో కలిసి అశోక్‌నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్ పాల్గొన్నారు.

కోలాహలం.. అళఘునాథుడి రథోత్సవం



అళఘునాథస్వామి రథోత్సవం

గూడూరు రూరల్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అళఘునాథస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు మంగళవారం స్వామి వారి రథోత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు గోవిందనామ స్మరణ చేస్తూ రథోత్సవంలో పాల్గొన్నారు. దారి పొడవునా భక్తుల జయజయధ్వానాల మధ్య అళఘునాథుడు పురవీధుల్లో విహరించారు. స్వామి వారిని దర్శించుకుని భక్తజనం తరించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

దొరవారిసత్రం: దొరవారిసత్రం బీసీ బాలురు గురుకుల పాఠశాలలో 5వ తరగతి, కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తిరుపతయ్య తెలిపారు. గురుకుల పాఠశాలలో 5వ తరగతికి (80 సీట్లు) ఇంగ్లిష్ మీడియం ఉన్నాయి. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 31తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా బాలురు కళాశాలలో (ఇంగ్లిష్ మీడియం) జూనియర్ ఇంటర్‌లో ప్రవేశం కోసం ఈనెల 31తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9866559644, 9160059700 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కండలేరులో 8.261 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 8.261టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 250 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 20, హైలెవల్ కాలువకు 95, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కోడ్ ఉల్లంగించొద్దు

కోట: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి తగిన జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ నాగరాజరావు మత పెద్దలకు సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ముస్లిం, క్రైస్తవ, హిందూ మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రార్థనా స్థలాల్లో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాజకీయ ప్రచార కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. రంజాన్, ఉగాది, శ్రీరామనవమి, గుడ్‌ఫ్రైడే వంటి పర్వదినాలను జరుపుకునే సమయంలో కోడ్ ఉల్లంఘన జరగకుండా నిబంధనలు పాటించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఎంపీడీఓ శంకరయ్య, డీటీ మల్లిఖార్జున్‌రావు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

– గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

చిల్లకూరు: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన కడివేడు గ్రామంలో ఎన్నికల నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేసే ఉద్యోగులు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనకూడదని తెలిపారు. అభ్యర్థులు ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేసినా యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

సమర్థవంతమైన నేత నేదురుమల్లి

- రామ్‌కుమార్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండించిన వైఎస్సార్‌సీపీ నేతలు
- రండి అభివృద్ధి చూపిస్తాం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వెంకటగిరి(సైదాపురం): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో వెంకటగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా సమర్థవంతమైన నాయకుడుగా నేదురుమల్లి రామ్‌కుమారెడ్డిని ఖరారు చేసినట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎల్ కోటేశ్వరరావు పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటంతో సేవ్ వెంకటగిరి అంటూ నినాదాలతో మెట్టకూరు ధనంజయరెడ్డి, కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సభ ఏర్పాటు చేశారు. ఆ సభలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని విమర్శించడంపై స్థానిక నేదురుమల్లి నివాసంలో మంగళవారం వెంకటగిరి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పనిచేయడంతో గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఎమ్మెల్యేను సస్పెండ్ చేసి వెంకటగిరి సమన్వయకర్తగా నేదురుమల్లిని నియమించారన్నారు. ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి ఇంటింటికి తిరిగి నియోజకవర్గంలోని 80వేల ఇళ్లకు చేరుకుని ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్న ఏకైక వ్యక్తి నేదురుమల్లి అన్నారు. పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తింపు తీసుకొచ్చేందుకు నేదురుమల్లి కృషిచేశారన్నారు. జగనన్న సూచించిన రామ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలుపించుకునేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. రాపూరు జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించి 200 ఎకరాలను భూసర్వే చేయించి నేదురుమల్లి భూములను కాపాడారన్నారు. నియోజకవర్గంలో తనకు న్యాయం చేయలేదని మాట్లాడిన మెట్టకూరు ధనంజయరెడ్డి తన కుటుంబంలోని వారికి పెంచలకోన చైర్మన్, ఎంపీపీ పదవులు ఇచ్చిన విషయం తెలియదా అని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతలతో సత్సంబంధాలు పెట్టుకుని నేదురుమల్లికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. డక్కిలి జేసీఎస్ కన్వీనర్ చింతల శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ గురించి మాట్లాడే అర్హత కోల్పోయారన్నారు. సైదాపురం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలు వ్యతిరేకించడం సమంజసం కాదన్నారు. వెంకటగిరి రూరల్ నేత కంచి గురుప్రసాద్ మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అయిన కొమ్మి లక్ష్మయ్యానాయుడు, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డితో కూడా కలిమిలి రాంప్రసాద్ ఇదే తరహాలో వ్యతిరేకంగా వ్యవహరించారన్నారు. జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ మాట్లాడుతూ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాటల మనిషి కాదని, చేతల మనిషని ఆయన సమన్వయకర్తగా 14 నెలలుగా వెంకటగిరిలో ఎన్నో అభివృద్ధి పనులకు నాంది పలికారన్నారు. బాలాయపల్లి వైఎస్సార్‌సీపీ నేత వెందోటి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి ఆయన చేస్తున్న వ్యతిరేక కార్యక్రమాలకు పార్టీ నుంచి సస్పెండ్ అయ్యే పరిస్థితికి తెచ్చుకున్నారన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ సేతరాసి బాలయ్య మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ పదవులు, అవకాశాలు వస్తాయని అంతలోనే అసంతృప్తి పడాల్సిన పనిలేదన్నారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ప్రచార విభాగం నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, చెలికం శంకర్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, వెంకటగిరి రూరల్ అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

- నెల్లూరు కలెక్టర్ హరినారాయణన్



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

రాపూరు: సార్వత్రిక ఎన్నికలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని నెల్లూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్క అధికారి బాధ్యతగా పనిచేసి ఎన్నికలను ప్రశాంతగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన..

రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ హరినారాయణన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఓటరుకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. వెంకటగిరి నియోజవర్గ రిటర్నింగ్ అధికారి ధ్యాన్‌చంద్, ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, సీఐ సుబ్రమణ్యం, తహసీల్దార్ వెంకటరత్నం, ఎస్ఐ మాల్యాద్రి, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సునంద, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా ఓటింగ్‌లో పాల్గొనాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

గూడూరురూరల్: సార్వత్రిక ఎన్నికల్లో యువత బాధ్యతాయుతంగా ఓటింగ్‌లో పాల్గొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని గూడూరు తహసీల్దార్ కరుణ్ కుమార్ సూచించారు. స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం స్వీప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్నికలు, ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, ఎంఈఓ కాంచన, మాస్టర్ ట్రైనర్స్ మురళి, శివకుమార్ పాల్గొన్నారు.

టేక్ హోమ్ రేషన్ కచ్చితంగా ఇవ్వాలి



జయలక్ష్మి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి

తిరుపతి అర్బన్: గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా టేక్ హోమ్ రేషన్ ఇవ్వాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి తెలిపారు. మంగళవారం తన చాంబర్ నుంచి ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి వారంలో వంద శాతం టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేయాలని వెల్లడించారు. జిల్లాలో 12,750 మంది గర్భిణులు, 11,509 బాలింతలు, 1,13,202 మంది చిన్న పిల్లలు(0–6ఏళ్లు) ఉన్నారని చెప్పారు. 2,492 అంగన్‌వాడీ సెంటర్లలో 2090 అంగన్‌వాడీ టీచర్లు, 348 మినీ అంగన్‌వాడీ టీచర్లు, 2,066 మంది హెల్పర్లు పనిచేస్తున్నారని ఆమె వివరించారు. ప్రతినెలా 15 రోజులకు ఒకసారి పంపిణీ చేస్తున్న టేక్ హోం రేషన్‌కు సంబంధించి మొదటి వారం, మూడో వారంలో వంద శాతం అందజేయాలని తెలియజేశారు. అంతేకాకుండా పంపిణీకి సంబంధించి ఆయా సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

నీటి ఎద్దడిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సూళ్లూరుపేట రూరల్: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీడీఓ చంద్రమౌళి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులతో మంగళవారం తాగునీటి సమస్యపై చర్చించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి దృష్టిలో ఉంచుకుని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి కొరత లేకుండా చూడాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు సూచించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ

డక్కిలి: తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ లీలామాధవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ వేసవిలో మండలంలో నీటి ఎద్దడి లేకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఈఓపీఆర్డీలు, ట్రాన్స్‌కో ఏఈలు కమిటీగా ఏర్పాటై నీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం ఎన్నికల కోడ్ అమలుపై సమీక్షించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ అల్లాభక్షు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- రఫీ తీరును ఖండించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నాయుడుపేటటౌన్: వ్యక్తి గత కారణాలతో పార్టీని వదిలి పెట్టిన రఫీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిలపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రఫీ వ్యవహారశైలిపై నేతలు విమర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కిలివేటిని, సత్యనారాయణరెడ్డిని విమర్శించే స్థాయి రఫీకి లేదని విమర్శించారు. ముందు పార్టీ ద్వారా పొందిన మున్సిపల్ వైస్ చైర్మన్ పదవికి రఫీ రాజీనామా చేయాలన్నారు. అర్బన్ జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్, పార్టీ యువత పట్టణ అధ్యక్షుడు పాలేటి నాగార్జున, నేతలు బైనా మల్లికార్జునరెడ్డి, కటకం జయరామయ్య, పి.రాజేష్, ఎస్‌సీఆర్, ఈదా రత్నశ్రీ, పేట చంద్రారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరామర్శ



వెంకటరత్నంను పరామర్శిస్తున్న నేతలు

పెళ్లకూరు: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నంను మంగళవారం పలువురు పార్టీ నేతలు పరామర్శించారు. వెంకటరత్నం సోదరుడు ఒబ్బు పుల్లయ్య(57) మృతిచెందడంతో స్థానిక ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ బెల్లపు రాఘవరెడ్డి, సర్పంచ్ ధర్మయ్య, నేతలు జితేంద్ర, రవి, బాలు, గోపాలయ్య, కృష్ణయ్య చెంబేడు గ్రామంలోని మృతుని నివాసానికి వెళ్లి పుల్లయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటరత్నం, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

ముత్యాలమ్మకు ఊంజల సేవ



ఊంజలసేవ నిర్వహిస్తున్న అర్చకులు

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి పల్లకీ సేవతోపాటు ఊంజలసేవ నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక అలంకారంతోపాటు విశేష పూజలు చేశారు. త్వరలో జరగనున్న అమ్మవారి జాతర సందర్భంగా భక్తులు ముందస్తు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీలో మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్ భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

7న ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి కల్చరల్: శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 7న సాయంత్రం 4.15 గంటలకు ఎంఆర్ పల్లిలోని యూత్ హాస్టల్లో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరునాయపాటి రాజగోపాల్, విశిష్ట అతిథిగా డాక్టర్ వి.కృష్ణవేణి, కవితా విశ్లేషకుడిగా శతావధాని ఆముదాల మురళి హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కవితా పఠనం, కవితా విశ్లేషణతోపాటు అతిథుల ప్రసంగం, హాజరైన కవులను సత్కరించినున్నట్లు తెలిపారు. ఉగాది కవి సమ్మేళనంలో కవులు, భాషాభిమానులు, సాహితీ వేత్తలు పాల్గొనాలని వారు కోరారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని పెరిమిటిపాడు గ్రామం నుంచి తిరుపతి వైపు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ప్రవీణ్‌రెడ్డి, సద్దాం హుస్సేన్, శివ, బషీర్ అనే వ్యక్తులు 76 బస్తాల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా వాహనంలో తరలిస్తుండగా విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణనాయక్, డీటీ ఓబయ్య పట్టుకుని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.లక్ష ఉంటుందని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు

గూడూరు రూరల్: జాతీయ రహదారిపై ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో మంగళవారం సాయంత్రం డివైడర్‌ను ఢీకొని ద్విచక్రవాహనదారులు ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. నెల్లూరు ఇందిరానగర్‌కు చెందిన కోటి, సురేష్ ఎల్‌ఈడీ స్క్రీన్ వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో పనిపై చెన్నైకి వెళ్లి తిరిగి నెల్లూరుకి వెళ్తుండగా ఆదిశంకర కళాశాల సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. హైవే మొబైల్ పోలీసు అజయ్ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108లో గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.25.24 లక్షలు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి శక్తి స్వరూపిణి శ్రీ పోలేరమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.25.24లక్షలు వచ్చినట్లు వెంకటగిరి గ్రూప్ దేవస్థానం ఆలయ ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈఓ మాట్లాడుతూ 5 నెలల 19 రోజులకుగాను ఈ మొత్తం నగదుతోపాటు 0.022 గ్రాముల బంగారం, 0.284 గ్రాముల వెండి, భక్తుల నుంచి కానుకలుగా వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తం కానుకలను వెంకటగిరి యూనియన్ బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బాబు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నూతన కార్యవర్గం

సూళ్లూరుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాలకు, రెండు మున్సిపాలిటీలకు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఇందులో సూళ్లూరుపేట మున్సిపాలిటీకి సంబంధించి మహిళా విభాగం అధ్యక్షురాలుగా ముంగర అమరావతి, బీసీ సెల్ అధ్యక్షుడిగా వంకా దినేష్‌కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పండ్లూరు రాఘవ, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఓపిల రవికుమార్, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా షేక్ రహమత్ ఆలీ, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా దొడ్డగ మునితేజ, చేనేత విభాగం అధ్యక్షుడిగా ఉమ్మిటి మధు, పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షుడిగా గోగుల తిరుపాల్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా రెక్కల వెంకట రమణారెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడిగా వేలపాళెం కృపాకర్‌రెడ్డి, ప్రచార విభాగం విభాగం అధ్యక్షుడిగా తుపాకులు ప్రసాద్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కాకి శ్రీరామ్మూర్తి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నారి రంజిత్‌కుమార్ ఎంపిక చేశారు. ఈ నూతన కార్యవర్గాన్ని పార్టీ కేంద్ర కార్యాలయం అధికారికంగా ప్రకటించింది.

సూళ్లూరుపేట రూరల్..

సూళ్లూరుపేట మహిళా విభాగం అధ్యక్షురాలిగా చిలకా అరుణమ్మ, రైతు విభాగం అధ్యక్షుడిగా బద్దెపూడి మోహన్‌కృష్ణారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా దాసరి జయరామయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దామతోటి లక్ష్మయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మచ్చ జనార్దన్, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా షేక్ అజారుద్దీన్, చేనేత విభాగం అధ్యక్షుడిగా లొక్కు రమణయ్య, పంచాయితీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా అల్లూరు రమేష్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా చలమటిగారి చెంగారెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షులుగా మాగర్ల మునస్వామి, ప్రచార విభాగం అధ్యక్షుడిగా కోడూరు రాజశేఖర్, క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడిగా వెల్లూరు సుకుమార్‌లను ఎంపిక చేశారు.

తడ మండలం

తడ: మహిళా విభాగంగా అధ్యక్షురాలుగా వల్ల సరస్వతి, రైతు విభాగ అధ్యక్షుడు చిల్లకూరు మునిరత్నంరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు పురషోత్తం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వి. శివకుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు జి.రాజయ్య, మైనార్టీ అధ్యక్షుడు సయిదా సర్దార్, వీవర్స్ వింగ్ అధ్యక్షుడు పి. గుణశేఖర్, పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షుడు కె. శ్రీనివాసులు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అట్రంబాకం దొరబాబురెడ్డి, సేవాదళ్ దళ్ వింగ్ అధ్యక్షుడు ఎన్. శ్రీనివాసులు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు ఏ.మురుగన్‌రెడ్డి, క్రిస్టియన్ , మైనార్టీ సెల్ అధ్యక్షుడు తుమ్మ జాన్ శశికుమార్‌లను పార్టీ నియమించింది.

ఓజిలి మండలం..

ఓజిలి: మహిళా విభాగం అధ్యక్షురాలుగా పాకనటి ప్రవీణ, రైతు విభాగం ఉచ్చూరు నారాయణరెడ్డి, బీసీ సెల్ ముమ్మడి రామయ్య, ఎస్సీ సెల్ జెడ్డా చంద్రా, మైనార్టీ షేక్ జానీభాషా, చేనేత ఎద్దు పెంచలయ్య, పంచాయతీరాజ్ వింగ్ కొండూరు వామనరాజు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ చిట్టేటి తిరుపాలయ్య, సేవాదళ్ కొండూరు ప్రభాకర్‌రాజు, ప్రచార కమిటీ పూసల కుమార్‌నాయుడు, క్రిష్టియన్ మైనార్టీ వింగ్ అధ్యక్షుడు గోవిందు పోలయ్యలను నియమించారు.

పెళ్లకూరు మండలం..

పెళ్లకూరు: మహిళా విభాగం అధ్యక్షురాలుగా పోలంరెడ్డి శ్రీదేవి, రైతు విభాగం అధ్యక్షుడు దువ్వూరు సతీష్‌రెడ్డి, బీసీ సెల్ ఎల్లు మోహన్, ఎస్సీ సెల్ గోగుతట్టు ఆనంద్, ఎస్టీ సెల్ తెర్ల సుబ్రమణ్యం, మైనారిటీ సెల్ షేక్ మస్తాన్ ముస్తఫా షాజీ, చేనేత పుట్టు యోగేశ్వర్, పంచాయతీరాజ్ గంజి మాతయ్య, టీయూసీ విభాగం గునిశెట్టి గోపాల్, సేవాదళ్ పిల్లా చలపతి, ప్రచార విభాగం కుమారి వీరకుమార్, క్రిస్టియన్ మైనారిటీ వంకపూరి మస్తానయ్యలను నియమించారు.

దొరవారిసత్రం మండలం..

దొరవారిసత్రం: మహిళా విభాగం అధ్యక్షురాలుగా గడ్డం జ్యోతి, రైతు విభాగం నాయుడు మధుసూదన్ రెడ్డి, బీసీ సెల్ గుర్ర హరిబాబు, ఎస్సీ సెల్ మన్నేలి పురుషోత్తం, ఎస్టీ సెల్ చెంబేటి వెంకటేశ్వర్లు, మైనార్టీ సెల్ షేక్ మౌలా సాహెబ్, వీవర్స్ వింగ్ నల్లు రవి, పంచాతీరాజ్ ఆరని సురేంద్రరెడ్డి, టీయూసీ నేలవల్లి రామచంద్రనాయుడు, సేవాదళ్ జాలా రాజగోపాల్, పబ్లిసిటీ కామిరెడ్డి ఈశ్వరబాబురెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ మేర్లపాక లతీఫ్ ఎన్నికయ్యారు.

నాయుడుపేట మండలం

నాయుడుపేటటౌన్: పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలుగా వెలూరు శ్రీనివాస కన్మణి, బీసీ సెల్ అధ్యక్షుడిగా ప్రదీప్‌కుమార్, ఎస్సీ సెల్ రాయపు శ్రీహరి రాజశేఖర్, ఎస్టీ సెల్ ఆబోతుల శ్రీకాంత్, మైనారిటీ సెల్ షేక్ రహమతుల్లా, విద్యార్థి విభాగం కోట్రమంగళం తేజ, చేనేత సిద్ధలింగం రాజేష్, పంచాయతీ రాజ్‌పేట చంద్రా రెడ్డి, ట్రేడ్ యూనియన్ ముద్దాపాటి శ్రీకాంత్, సేవాదళ్ వింగ్ నిడిగింటి చిట్టిబాబు, ప్రచార విభాగం సిద్ధయ్య, వాణిజ్యం గాధం శెట్టి మోహన్‌రావు, క్రిస్టియన్ మైనారిటీ పరిమళ ప్రవీణ్ టైసన్ నియమితులయ్యారు.

సూళ్లూరుపేట నియోజకవర్గ ఓటర్ల వివరాలు

- జనవరి 2024 నాటికి 2,37,700 మంది ఓటర్లు
- 304 పోలింగ్ కేంద్రాలు



సూళ్లూరుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 128 పంచాయతీలు, రెండు మున్సిపాలిటీలు కలుపుకుంటే 2024 ఎన్నికలకు 304 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,37,700 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 1,15,802, మహిళలు 1,21,876, ట్రాన్స్‌జెండర్లు 22 మంది వున్నారు. 2019 ఎన్నికల్లో 2, 31, 638 ఓటర్లు కాగా ఈసారి 6,062 మంది పెరిగారు. పురుషులు, 2014 మంది, మహిళా ఓటర్లు 4,026 మంది పెరిగారు. 2019 ఎన్నికల్లో 294 పోలింగ్ కేంద్రాలుండగా ఈసారి 10 పోలింగ్ కేంద్రాలను పెంచి 304 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంటే గత ఎన్నికలకు, ఈ ఎన్నికలకు పది పోలింగ్ కేంద్రాలు, 6,062 మంది ఓటర్లు పెరిగారు. అయితే ఓజిలి మండలం వజ్జావారిపాళెంలో ఒకటవ నంబర్ పోలింగ్‌స్టేషన్‌తో ప్రారంభమై తడ మండలం పన్నంగాడులో 304వ పోలింగ్ స్టేషన్‌తో చివరిది అవుతుంది. మండలాల వారీగా పరిశీలిస్తే..

- ఓజిలి మండలంలో 26 పంచాయతీలకు 39 పోలింగ్ కేంద్రాలు. 28,182 ఓట్లు వున్నాయి. ఇందులో పురుషులు 12,738, మహిళలు 14,401, ట్రాన్స్‌జెండర్స్ ఇద్దరు వున్నారు.
- నాయుడుపేట రూరల్‌లో 19 పంచాయతీలకు 37 పోలింగ్‌కేంద్రాలు వున్నాయి. 27,028 మంది ఓటర్లు వున్నారు. ఇందులో 13,098 పురుషులు, 13,928 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్ జెండర్స్ వున్నారు.
- నాయుడుపేట అర్బన్ 25 వార్డులకుగాను 37 పోలింగ్‌కేంద్రాల పరిధిలో 32,349 మంది ఓటర్లు వున్నారు. 15,411 మంది పురుషులు, 16,933 మంది మహిళా ఓటర్లు, ఐదుగురు ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు.
- దొరవారిసత్రం మండలంలో 22 పంచాయతీలకు 41 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 27,992 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 13,664 మంది పురుషులు, 14,320 మంది మహిళలు, ఎనిమిది మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు.
- పెళ్లకూరు మండలంలో 24 పంచాయతీలకుగాను 36 పోలింగ్ కేంద్రాలు వున్నాయి. 27,070 మంది ఓటర్లు ఉన్నారు. 13,214 మంది పురుషులు, 13,854 మంది మహిళా ఓటర్లు, ఇద్దరు ట్రాన్స్ జెండర్స్ ఓటర్లు వున్నారు.
- సూళ్లూరుపేట రూరల్ పరిధిలో 19 పంచాయతీల్లో 34 పోలింగ్ కేంద్రాలున్నాయి. 25,899 మంది ఓటర్లున్నారు. 12,776 మంది పురుషులు, 13,123 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.
- సూళ్లూరుపేట అర్బన్ పరిధిలోని 25 వార్డుల పరిధిలో 37 పోలింగ్ కేంద్రాలున్నాయి. 34,680 మంది ఓటర్లు వున్నారు. ఇందులో 16,794 మంది పురుషులు, 17,884 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్స్ ఓటర్లున్నారు.
- తడ మండలంలో 18 పంచాయతీలకుగాను 43 పోలింగ్ కేంద్రాలున్నాయి. 34,540 మంది ఓటర్లున్నారు. 17,107 మంది పురుషులు, 17,433 మంది మహిళా ఓటర్లున్నారు.